సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం । 11 । జనవరి । 2023



గజ గజ
శీతాకాలం తడాఖా చూపిస్తోంది. కొన్ని రోజులుగా జిల్లా ప్రజలు చలితో వణికిపోతున్నారు. -IIలో..



భారీ స్కోరు చేసిన ఆంధ్రా జట్టు
అంతర్ రాష్ట్రాల అండర్–25 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 541 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. -IIలో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.1/18.3

జిల్లాలో మంగళవారం 30.1 – 18.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. –కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

12న మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కడప రూరల్: నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయుటకు ఈ నెల 12వ తేదీన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలను చేపడుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కడప.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్ సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తును వెబ్ సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ఆ దరఖాస్తుకు సంబంధిత సర్టిఫికెట్స్‌ను జతపరచి ఈ నెల 12వ తేదీన కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే వాక్ ఇన్ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ ఏఎఫ్‌యూ వీసీగా ఆచార్య ఫజల్ రెహమాన్



ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఆచార్య పి. ఫజల్ రెహమాన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించిన ఆచార్య మునగల సూర్యకళావతి పదవీ కాలం ముగియడంతో ఆమె స్థానంలో పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో కర్నూలు అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌ను నియమిస్తూ ఉన్నత విద్య ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జె. శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు.

• కర్నూలు పట్టణానికి చెందిన ఎస్.ఎ. సిద్దిఖీ, నూరున్నిసాల కుమారుడైన ఈయనకు 29 సంవత్సరాలకు పైగా బోధన, పరిశోధన అనుభవం ఉంది. ఎస్వీయూ నుంచి బీఎస్సీ పూర్తి చేసిన ఈయన ఎంఎస్సీ అగ్రికల్చర్ (నెమటాలజీ), ఎంఫిల్, పీహెచ్‌డీ అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం నుంచి పూర్తి చేశారు. 2001–2004 వరకు హైదరాబాద్ మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయం డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2004–07 వరకు రీడర్‌గా, 2007–14 వరకు ప్రొఫెసర్‌గా పనిచేశారు. 2013–19 వరకు జువాలజీ ప్రొఫెసర్‌గా, 2019–22 వరకు యూజీసీ హ్యూమన్ రీసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్‌గా పనిచేశారు. పలు బోర్డులు, పలు సంస్థల్లో సభ్యులుగా ఉన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ సభ్యులుగా కూడా పనిచేశారు. అనంతరం ప్రస్తుతం కర్నూలులోని డా. అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

మదనపల్లె సిటీ: విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల సక్రమ అమలుకు పాఠశాలలలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడీ మర్తాల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మదనపల్లె మండలం సీటీఎంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో అటల్‌టింకరింగ్ ల్యాబ్, టీచింగ్ బుక్స్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ పాఠ్యాంశాలకు సంబంధించి ప్రణాళిక, టీచింగ్ డైరీ కలిగి ఉండాలన్నారు. తమ సబ్జెక్టులకు సంబంధించి ప్రతి విద్యార్థి చేత వర్క్ బుక్ పూర్తి చేయించాలన్నారు.

వడివడిగా బడిబాట

- ఇంటింటి సర్వేలో బడి మానేసిన పిల్లల గుర్తింపు
- తల్లిదండ్రులకు నచ్చజెప్పి తిరిగి పాఠశాలలకు పిల్లలు
- డ్రాప్‌అవుట్స్‌ను బడికి పంపించే కార్యక్రమంలో రాష్ట్రంలో జిల్లా ఫస్ట్
- ఉమ్మడి జిల్లాలో 8176 మంది గుర్తింపు

బడిబయట సర్వేలో భాగంగా తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సమగ్రశిక్ష అధికారులు



కడప ఎడ్యుకేషన్: విద్యారంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. దీంతోపాటు ప్రభుత్వ బడులకు నాడు–నేడు ద్వారా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి కార్పోరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నారు. అలాగే విద్యార్థులకు బోధనా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు, అంతర్జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో తలపడేలా సిబిఎస్‌సి సిలబస్‌ను ప్రవేశపెట్టింది. దీంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో బోధన సాగేలా అన్ని రకాల చర్యలు చేపట్టారు. అయినప్పటికీ వివిధ కారణాలతో బడి మానేసిన పిల్లలను తిరిగి బడి బాట పట్టించేందుకు ప్రభుత్వం కార్యచరణ రూపొందించింది. పిల్లల డ్రాపౌట్స్‌కు గల కారణాలను తల్లిదండ్రుల ద్వారా తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించి బడిబయట పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాన్ని చేపట్టారు.

• ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని 51 మండలాల్లో సీఆర్‌పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్, కేజీబీవీ సిబ్బంది పట్టణాలు, పల్లెలో తిరిగి సర్వే చేపట్టారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి 5 నుంచి 14 సంవత్సరాల్లోపు వయసు గల బడి మానేసిన పిల్లలను గుర్తించారు. ఇందులో భాగంగా బాల కార్మికులు, యాచకులు, తల్లిదండ్రులులేని పిల్లలు, దివ్యాంగ పిల్లలు, నివాస ప్రాంత సమీపంలో పాఠశాలలు లేకపోవడం, ఓవర్ ఏజ్ పిల్లలను, చదివించేందుకు ఆసక్తి లేని పిల్లలను ఇలా మొత్తంగా 8176 మంది అవుట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్స్‌ను ఓఎస్‌సీ సర్వే ద్వారా గుర్తించి మన బడికి పోదాం యాప్ ద్వారా వివరాలను నమోదు చేశారు. గుర్తించిన వీరందరిని వారికి అనుకూలమైన ప్రాంతంలోని పాఠశాలల్లో చేర్పించి వారందరినీ బడిబాట పట్టించారు. ఇందుకు సంబంధించిన సర్వేలో, పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమంలో రాష్ట్రంలోనే మన జిల్లా మొదటిస్థానంలో నిలిచింది.



బడిబయట విద్యార్థిని బడిలో చేర్పిస్తున్న సీఆర్‌పీ



బడి బయట పిల్లోడితో బిస్మిల్లానగర్ ఉపాధ్యాయులు

హాజరుపై నిరంతర పర్యవేక్షణ

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు నిత్యం పాఠశాలకు వస్తున్నారా లేదా అనే పర్యవేక్షణ ఉంటోంది. ఎవరైనా వరుసగా మూడు రోజులు బడికి హాజరుకాకపోతే వారి తల్లిదండ్రులకు వలంటీర్ ఫోన్ ద్వారా మెసేజ్ పంపుతారు. తిరిగి వారు బడికి వచ్చేలా చర్యలు చేపడుతున్నారు. అలాగే ఉపాధ్యాయులు హాజరును రిథమ్స్‌యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో పాటు సచివాలయంలో పనిచేసే సంక్షేమ విద్యా అసిస్టెంట్ వారంలో ఒక రోజు తన పరిధిలోని పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాలల సౌకర్యాలను పరిశీలించాల్సి ఉంది. అలాగే సచివాలయంలో పనిచేసే ఏఎన్ఎం కూడా పాఠశాలలను సందర్శించి పిల్లలకు ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తారు. అలాగే మహిళా పోలీసు కూడా వారంలో ఒక రోజు పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులపై పర్యవేక్షించాల్సి ఉంటుంది. వీరందరూ తమ పరిశీలనలో వెల్లడైన వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది, ఈ వివరాలకు అనుగుణంగా ఎక్కడైనా సమస్యలు, లోపాలు ఉంటే వెంటనే పరిష్కరిస్తారు.

బడికి పోయి బాగా చదువుకుంటా..



కొన్ని కారణాల వల్ల నేను బడికి పోకుండా మానేశాను. విద్యాశాఖ అధికారులు మా ఇంటికి వచ్చి మా వాళ్లతో మాట్లాడి నన్ను మళ్లీ బడిలో చేర్పించారు. ఇక నేను రోజు బడికి పోయి బాగా చదువుకుంటా. మా వాళ్లకు మంచిపేరు తెస్తా. – షమీరా, ఆజాద్‌నగర్, కడప

బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం...



బడి ఈడు పిల్లలు అందరూ బడి బయట కాకుండా బడిలో చేర్పించేందుకు జిల్లావ్యాప్తంగా సర్వే నిర్వహించి ప్రతి ఒక్క బడి బయటి విద్యార్థిని బడిలో చేర్పించాము. వారందరికి నాణ్యమైన విద్యను అభ్యసించడానికి అన్ని రకాల వసతులను కల్పించాము. ఇందుకు సంబంధించిన సర్వేలో వైఎస్సార్‌జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. బడిలో చేర్పించిన పిల్లలు క్రమ తప్పకుండా బడికి వచ్చే విధంగా ఉపాధ్యాయులకు, సీఆర్‌పీలకు ప్రత్యేక ఆదేశాల ద్వారా ప్రతి రోజు మానిటరింగ్ చేసకుంటున్నాం.
– అంబవరం ప్రభాకర్‌రెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి

నాడు–నేడు పనులను సకాలంలో పూర్తి చేయాలి

జేసీ సాయికాంత్‌వర్మ

కడప సిటీ : నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా మనబడి నాడు–నేడు పనులను సకాలంలో పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో మొదటిమూడు స్థానాల్లో నిలిపేందుకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో నాడు–నేడు ఫేజ్–2 పనుల పురోగతిపై ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజనీరింగ్ అధికారులతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ మన బడి నాడు–నేడు రెండవ దశలో భాగంగా జిల్లాలో 40 శాతానికి పైగా పాఠశాలల్లో మంజూరైన టాయిలెట్లు, ఎలక్ట్రికల్, కాంపౌండ్ వాల్, అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్స్, మేజర్, మైనర్ మరమ్మతులతోపాటు మిగిలిన ఆరు రకాల అభివృద్ధి పనులను సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఫోటోలు తీసి వారంరోజుల్లోపు పంపాలన్నారు. రూ.288 కోట్లతో జిల్లా వ్యాప్తంగా 998 పాఠశాలలు, 9 జూనియర్ కళాశాలల్లో చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష పీడీ ప్రభాకర్‌రెడ్డి, డీఈఓ దేవరాజు, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసులు రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వీరన్న, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలలో వేగం పెంచాలి : జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్యలతో కలిసి జిల్లాలో జగనన్న హౌసింగ్ కాలనీల్లో జరుగుతున్న గృహ నిర్మాణాల పురోగతి, మౌలిక వసతులు, ఓటీఎస్ తదితర అంశాలపై ఆర్డీఓలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులతో జేసీ సమీక్షించారు. హౌసింగ్ కాలనీల్లో నిర్మాణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నా రు. లోటుపాట్లకు తావివ్వకుండా అవగాహనతో లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, శ్రీనివాసులు, వెంకటేశు పాల్గొన్నారు.

పారిశ్రామికరంగ అభివృద్ధికి పటిష్ట చర్యలు

కడప సిటీ : జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని డీఐఈపీసీ సభ్యులను కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జేసీ సాయికాంత్‌వర్మ, నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలే ఆర్థిక ప్రగతికి ఆయువుపట్టు అన్నారు. పారిశ్రామికరంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సహించాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ (ఐడీపీ) 2015–20, 2020–23ను అనుసరించి జిల్లాలోని అన్ని సెక్టార్లలోని మొత్తం 117 యూనిట్లకుగాను రూ. 13.13 కోట్ల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. అలాగే ఏపీఐఐసీకు సంబంధించి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కొత్త యూనిట్ ఏర్పాటు కోసం వచ్చిన ఆరు దరఖాస్తులను ఆమోదించామన్నారు. అంతకుముందు పరిశ్రమలశాఖ జీఎం జయలక్ష్మి సంబంధిత వివరాలను సమావేశంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్‌మేనేజర్ శ్రీనివాసమూర్తి, డీపీఓ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిపార్టుమెంటు కృష్ణమూర్తి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ జావిద్‌బాష, వాణిజ్య, ఏపీఎస్ పీడీసీఎల్, కార్మికశాఖల అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు పక్కా ఏర్పాట్లు

- కలెక్టర్ విజయరామరాజు
- కోవిడ్ నిబంధనలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని సభా భవనంలో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లపై జేసీ సాయికాంత్ వర్మ, డీఎఫ్ఓ సందీప్ రెడ్డి, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలిసి అన్నిశాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన స్థానిక పోలీసు పెరేడ్ మైదానంలో నిర్వహించే వేడుకల్లో జెండా వందనం కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించి జిల్లాలో సాధించిన ప్రగతిని చాటిచెప్పేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేసేందుకు ప్రతిపాదిత జాబితాను నిర్దీత గడువులోగా అందించాలన్నారు. కోవిడ్–19 ప్రభావం నేపథ్యంలో ప్రతి ఒక్కరూ భౌతిక దూరాన్ని పాటించేలా సీట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, సీపీఓ వెంకట్రావు, రిమ్స్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలి

ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అన్ని ప్రాధాన్యత రంగాలను మరింత పటిష్టం చేసి జిల్లాను ప్రగతిపథంలో నడిపించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాలులో కలెక్టర్ అధ్యక్షతన అన్ని రకాల ప్రాధాన్యత రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా రంగాల్లో జిల్లాకు నిర్దేశించిన పలురకాల లక్ష్యాలు, పనుల పురోగతి, సాధించిన ప్రగతి తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. వ్యవసాయశాఖ పరిధిలో జిల్లాలో విస్తృత సాగుబడిని పెంచడంతో పాటు అధిక దిగుబడులు అందుకునేలా సాగుబడి యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ఏపీ ఎంఐపీ ద్వారా రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సన్న, చిన్నకారు రైతులకు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పశుసంవర్ధకశాఖలో వైద్యులు సేవలను మరింత విస్తృతం చేస్తూ పాడి పరిశ్రమ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకందారులు ఆర్థికంగా ముందుకు వెళ్లేందుకు సహకారాలు అందించాలన్నారు. మార్కెటింగ్‌శాఖ ద్వారా రైతులకు సీజన్ల వారీగా అవసరమైన అన్ని రకాల ఎరువులను, పెస్టిసీడ్స్‌ను ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా పౌరసరఫరాలశాఖ ద్వారా జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలుచేస్తున్న అన్ని రకాల సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, పశుసంవర్ధకశాఖల జేడీలు నాగేశ్వరరావు, శారదమ్మ, హార్టికల్చర్ డీడీ మైఖేల్‌రాజు, పరిశ్రమలశాఖ జీఎం జయలక్ష్మి, పిషరీస్, సెరికల్చర్ డీడీలు, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

డీపీఓ ప్రభాకర్‌రెడ్డి



కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ పంచాయతీల్లో పన్నులు వసూలు చేసేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, ఈఓపీఆర్‌డీలు, డీఎల్‌పీఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022–23కు గాను జిల్లాలోని 557 పంచాయతీల్లో రూ. 22 కోట్ల పన్ను వసూళ్ల లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 50 శాతం మాత్రమే వసూలైందని పేర్కొన్నారు. ఈ నెల చివరి నాటికి దాన్ని 75 శాతానికి, ఫిబ్రవరి నాటికి 90 శాతం, మార్చి 15 నాటికి వంద శాతం వసూళ్లు చేయాలని కోరారు. కొన్ని పంచాయతీల్లో పన్నుల వసూళ్లు సక్రమంగా జరగడం లేదని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. పన్ను వసూళ్ల ద్వారా వచ్చే నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలైన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, వీధి లైట్లు వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటి పన్ను, నీటిపన్ను, లైసెన్సు ఫీజు, ఇంటి అనుమతులు, లైబ్రరీ సెస్, ప్రభుత్వ స్థలాలు, రైస్ మిల్లులు, దుకాణాలు, ప్రభుత్వ భవనాలు, ప్రైవేటు విద్యా సంస్థలు తదితర వాటి ద్వారా రావాల్సిన పన్నులను తక్షణమే వసూలు చేయాలని కోరారు.

నేటి నుంచి ఆర్టీసీ ‘సంక్రాంతి’ స్పెషల్

- పండుగకు సాధారణ చార్జీలతోనే ప్రయాణం
- కడప జోన్ నుంచి 359 ప్రత్యేక సర్వీసులు
- నేటి నుంచి 14వ తేదీ వరకు ఏర్పాటు
- ఇప్పటికే 80 శాతం టిక్కెట్లు రిజర్వు



కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతి ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసీ 359 ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. కడప జోన్ నుంచి కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి వివిధ ప్రాంతాలకు, పొరుగు రాష్ట్రాలకు ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు సంక్రాంతి స్పెషల్ పేరిట బస్సులను నడుపుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి స్పెషల్ బాదుడుకు సంస్థ స్వస్తి చెప్పింది. సాధారణంగా పండుగ సమయాల్లో స్పెషల్ బస్సుల్లో ప్రయాణించాలంటే టిక్కెట్‌పై అదనంగా వసూలు చేసేవారు. అయితే ఈ ఏడాది ఆర్టీసీ యాజమాన్యం సాధారణ ఛార్జీలను మాత్రమే వసూలు చేస్తోంది. విజయవాడ, హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి రాయలసీమలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణీకుల రాకపోకలకు ప్రత్యేక బస్సులను నడుపుతోంది. వీటిలో 11వ తేదీన 80 బస్సులు, 12న 130 బస్సులు, 13న 141 బస్సులు, 14వ తేదీన 359 బస్సులను నడుపుతోంది.

ఆన్‌లైన్ రిజర్వేషన్లు

ఈనెల 11, 12, 13 తేదీల్లో హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై, విజయవాడ, తిరుపతి ప్రాంతాలకు బస్సులను నడిపేందుకు రిజర్వేషన్లు కల్పించారు. ఇప్పటికే 80 శాతానికి పైగా రిజర్వేషన్లు చేసుకున్నారు. ఇంకా ప్రయాణీకుల రద్దీని బట్టి అదనపు సర్వీసులను నడుపుతామని అధికారులు తెలిపారు.

ప్రత్యేక రాయితీలు

- ప్రయాణీకులు రాను, పోను టిక్కెట్ ఒకేసారి తీసుకున్న వారికి తిరుగు ప్రయాణంలో 10 శాతం రాయితీ కల్పిస్తున్నారు.
- ఏపీఎస్ ఆర్టీసీ వ్యాలెట్ ద్వారా టిక్కెట్ తీసుకునే ప్రయాణీకులకు 5 శాతం రాయితీ ఇస్తున్నారు.
- నలుగురు కుటుంబ సభ్యులు (పిల్లలతోసహా) ఒకేసారి టిక్కెట్ బుక్ చేసుకుంటే ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నారు.
- వయో వృద్ధులకు (60 ఏళ్లు నిండిన వారికి) అన్ని రకాల సర్వీసుల్లో (ఏసీ, నాన్ ఏసీ) 25 శాతం రాయితీ ఇస్తున్నారు.
- ప్రయాణీకులు టిక్కెట్లను ఆన్‌లైన్‌లోగానీ, తమ సమీపంలోని బస్టాండులోగానీ, ఆర్టీసీ ఆధీకృత టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ల ద్వారాగానీ పొందవచ్చు.

కడప రీజియన్ నుంచి

కడప రీజియన్ నుంచి హైదరాబాదుకు 59, విజయవాడ 15, బెంగుళూరు 46, చెన్నై 9, తిరుపతికి 45 బస్సులను నడిపేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రయాణీకుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. అలాగే ప్రయాణీకులకు ఆర్టీసీ పలు రాయితీలను ఇస్తోంది. ప్రయాణీకులకు ఉపశమనం కలిగేలా ఈ ఏడాది ఎటువంటి అదనపు చార్జీలు లేకుండా సాధారణ చార్జీలను మాత్రమే వసూలు చేస్తున్నాం. ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలి. – **గోపినాథ్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆర్టీసీ కడప జోన్, కడప**

ఉల్లాసంగా.. ఉత్సాహంగా ...



లాంగ్ జంప్‌లో పాల్గొన్న మహిళా కానిస్టేబుళ్లు

కడప నగరంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో రెండవరోజున మంగళవారం ఉత్సాహంగా జిల్లా పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ -2023 కొనసాగింది. జిల్లాలోని ఆరు పోలీస్ సబ్ డివిజన్‌ల నుంచి పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు. హాకీ, వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, మహిళలకు కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగంలో పరుగుపోటీలతో పాటు, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో విభాగాల్లో పోటీలు జరిగాయి. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎ స్.ఎస్.వి కృష్ణారావు, ఏ.ఆర్.డిఎస్పీ రమణయ్య పర్యవేక్షించారు. -కడప అర్బన్

క్లుప్తంగా

14న సంక్రాంతి కవి సమ్మేళనం

బద్వేలు అర్బన్ : బద్దెన కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 14న బద్వేలులోని ఎన్జీవో హోంలో జిల్లా స్థాయి సంక్రాంతి కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కళాపీఠం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగసాని సాంబశివారెడ్డి, బలపనూరు శంభుప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన కవులు, సాహితీవేత్తలు పేర్లు నమోదు చేసుకోవాలని వారు పేర్కొన్నారు. అలాగే 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు భక్తిపాటల పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 9440725022, 9959870896 ఫోన్ నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

రైతుల అభివృద్ధికి కృషి చేయాలి

కడప అగ్రికల్చర్ : రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉండే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు రైతుల అభివృద్ధికి కృషి చేయాలని గుంటూరు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్ ప్రమీల పేర్కొన్నారు. మంగళవారం కడప కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడేలా శిక్షణలతోపాటు డెమోలను నిర్వహించాలని సూచించారు. ఆర్బీకే పరిధిలో ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్ 155251ను రైతులందరికీ తెలిసేలా డిస్‌ప్లే చేయాలని పేర్కొన్నారు. అలాగే సీజన్ వారీగా పంట సాగులో మెలకువలతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరావు, ఆత్మ పీడీ విజయలక్ష్మి డీపీఎం పద్మలత తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈఈఎంటీ ఆన్‌లైన్ మాక్ పరీక్ష



జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫ్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎడ్యుకేషనల్ ఎఫిపని వారు ప్రతిభ అన్వేషణ మాక్ పరీక్ష(ఈఈఎంటీ–2023)ను బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు మొబైల్, కంప్యూటర్, ల్యాప్ టాప్ తదితరాల ద్వారా ఎక్కడి నుంచైనా రాయ వచ్చునని ఆయన పేర్కొన్నారు. 7వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే జరుగునన్నారు. మన జిల్లా నుంచి 10వ తరగతి విద్యార్థులు 4600, 7వ తరగతి విద్యార్థులు 1495 మంది పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. వీరికి వారి మొబైల్ నంబర్‌కు హాల్‌టికెట్‌లు పంపించినట్లు తెలిపారు. వాటిని ఉపయోగించుకుని పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. హాల్‌టికెట్ రాని వారు వారి ఉపాధ్యాయులను సంప్రదిస్తే తాము తెలియపరుస్తామని వివరించారు.

గజ గజ



- వణికిస్తున్న చలి
- మూడు రోజుల నుంచి పెరిగిన తీవ్రత
- ఉదయం 9 గంటల వరకు పొగమంచు
- వరి పంటపై తీవ్ర ప్రభావం.. ఆందోళనలో అన్నదాతలు

జిల్లాలో గత 5వ తేదీ నుంచి నమోదైన కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రత వివరాలు

తేదీ	కనిష్టం	గరిష్టం
5.1.23	18.4	30.3
6.1.23	17.6	31.0
7.1.23	17.7	30.0
8.1.23	17.7	29.9
9.1.23	11.6	30.7
10.1.23	18.3	30.1

కడప అగ్రికల్చర్ : శీతాకాలం తడాఖా చూపిస్తోంది. కొన్ని రోజులుగా జిల్లా ప్రజలు చలితో వణికిపోతున్నారు. మొదట్లో తీవ్ర ప్రభావం చూపింది. తర్వాత కొంత వరకు తగ్గింది. అయితే ఇటీవల పంజా విసురుతోంది. దీంతోపాటు రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. అలాగే ఉదయం 9 గంటల వరకు పొగమంచు ఆవరించడంతో ప్రజలు చలికి వణికిపోతున్నారు. పట్టణాల్లో ఫుట్‌పాత్, పూరి గుడుసెల్లో నివసించే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులపై పొలాలకు వెళ్లే రైతులు గజగజ వణికిపోతున్నారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో వరిపంట చిరుపొట్టదశంలో ఉంది. ఈ పొగమంచుతో వెన్నులోకి మంచునీరు దిగడంతోపాటు ఈ వాతావరణం కారణంగా తాకుగింజలు వచ్చే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

కప్పేస్తున్న మంచు దుప్పటి

కొన్ని రోజులుగా ఉదయం 9 గంటల వరకు పొగమంచు కురుస్తోంది. దీంతోపాటు పంట పొలాలు, గ్రామాలు, రహదారులు కనిపించకుండా మంచు కప్పేస్తోంది. జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చిన్నారులు, వృద్ధులు జ్వరం, జలుబు బారిన పడుతున్నారు. పర్యవసానంగా ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

పొంచి ఉన్న కరోనా

కరోనా పొంచి ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ చలిగాలులతో జలుబు, దగ్గు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఈ చలి తీవ్రతతో జనాలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది.

జాగ్రత్తలు పాటించాలి



అస్తమా, అలర్జీ ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకుంటే చలి తీవ్రత వల్ల వ్యాధి ఎక్కువ అవుతుంది. చలిగాలుల్లో తిరగరాదు, చిన్న పిల్లలను తిప్పకూడదు. స్వెట్టర్లతోపాటు చెవులు కప్పే విధంగా ఉంటే టోపీలు వాడుకోవాలి. కాచి చల్లార్చిన నీరు తాగితే ఆరోగ్య రీత్యా మంచిది.

– డాక్టర్ అవ్వారు అర్జున్‌కుమార్, ప్రముఖ వైద్యులు, కడప.

దివ్యాంగులకు చేయూత

చేతి కర్రలు ఇచ్చిన జిల్లా అధికారులు



దివ్యాంగులకు చేతి కర్రలు అందజేస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్ : దారిన పోతున్న కొంత మంది దివ్యాంగులను గుర్తించి కడప కలెక్టరేట్ సభాభవనంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల శాఖ సహకారంతో జిల్లా అధికారులు ఊత కర్రలను అందించారు. ఈ సందర్భంగా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ సుమారు పది వేల మంది వివిధ రకాల దివ్యాంగులను గుర్తించి అలింకో కంపెనీ సహకారంతో మెడికల్ వైద్య శిబిరాలు నిర్వహించారని తెలిపారు. వారికి అవసరమైన కృత్రిమ అవయవాలతోపాటు వీల్‌చైర్స్, ట్రై సైకిల్స్, స్టిక్స్, వినికిడి యంత్రాలు మొదలగు పరికరాలు ఇవ్వడానికి జిల్లా యంత్రాంగం ప్రణాళికలను సిద్ధం చేసిందని చెప్పారు. అందులో భాగంగా ప్రస్తుతం కొందరికి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ యదుభూషణ్‌రెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు, జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీమలో కృష్ణా యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్ : రాయలసీమలో కృష్ణా నది యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కోటిరెడ్డి సర్కిల్‌లో అఖిలపక్ష పార్టీల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత కృష్ణా నదిలో అతి పెద్ద పరీవాహక ప్రాంతం అయిన రాయలసీమ ప్రాజెక్టులకు ముఖ ద్వారమైన కర్నూలులో కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం న్యాయబద్ధం అన్నారు. రాష్ట్ర విభజన ముందు హైదరాబాద్‌లో ఉన్న కృష్ణా యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని చూడటం సరికాదన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష పార్టీల నాయకులు గర్రప్ప, నీలి శ్రీనివాసరావు, నజీర్ అహ్మద్, కృష్ణమూర్తి, యంవి సుబ్బారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇదే విషయంపై ఆర్‌సీపీ ఆధ్వర్యంలో కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన చేపట్టారు. ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవి శంకర్‌రెడ్డి, ఆర్‌సీపీ నాయకులు శంకర్, మగ్బూల్ బాషా, చాపల సుబ్బరాయుడు, లక్ష్మీదేవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా జట్టు భారీ స్కోరు



తలపడుతున్న ఆంధ్ర, చండీగఢ్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న కల్నల్ సీకే నాయుడు అంతర్ రాష్ట్రాల అండర్–25 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు 541 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. 417 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు మంగళవారం బరిలోకి దిగిన ఆంధ్రా జట్టు 161 ఓవర్లలో 541 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని కె.మహీప్‌కుమార్ 267 పరుగులు చేశాడు. టి.విజయ్ 42 పరుగులు చేయగా, సాకేత్‌రామ్ 57 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చండీగఢ్ బౌలర్ మహమ్మద్ అసద్ 5 వికెట్లు, పరాస్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన చండీగఢ్ జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 139 పరుగులు చేసింది. జట్టులోని తరణ్ ప్రీత్‌సింగ్ 28, పరాస్ 27 పరుగులు చేశారు. ఎ.ఎ.కుమార్ 30 పరుగులు, అర్జున్ శర్మ 4 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఆంధ్రా బౌలర్ ఎం.ఆంజనేయులు 3 వికెట్లు తీశాడు. ఈయనతోపాటు గిరినాథ్‌రెడ్డి, రాజు, సాకేత్‌రామ్, మహీప్ తలా ఒక వికెట్ చొప్పున తీశారు. దీంతో మూడో రోజు ఆట ముగిసింది.



267 పరుగులు చేసిన కె.మహీప్‌కుమార్



3 వికెట్లు తీసిన ఆంధ్రా బౌలర్ ఆంజనేయులు

జిల్లాలో పోలీసుల దాడులు

కడప అర్బన్ : జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యంపై జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు మంగళవారం పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, సిబ్బంది మెరుపుదాడులు నిర్వహించారు. 36.15 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, 2.70 లీటర్ల డ్యూటీ పెయిడ్ లిక్కర్ (మొత్తం 38.85 లీటర్లు)ను స్వాధీనం చేసుకుని, రెండు కేసులు నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా, జూదం, నిషేధిత గుట్కాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 14500కు అందించాలని జిల్లా ఎస్పీ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రి ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతని మృతదేహాన్ని పరిశీలించారు. అతనికి 55 ఏళ్లకు పైగా వయసు ఉంటుందని వారు తెలిపారు. మృతుడి గురించి ఆస్పత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సైకిల్ స్టాండు సమీపంలో అతను పడుకొని ఉన్నట్లు వారు తెలిపారు. ఈ క్రమంలో అతను సాయంత్రం మరణించడంతో మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే ఔట్‌పోస్టులో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ మనక్ పోటీలు



విద్యార్థులు సిద్ధం చేసిన ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఈఓ దేవరాజు, సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : మనక్ 2021–22కు సంబంధించిన జిల్లా స్థాయి పోటీలను ఈ ఏడాది ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు, జిల్లా సైన్సు అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సిద్ధం చేసిన ప్రాజెక్టును వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021–22 విద్యా సంవత్సరానికి గాను ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో జిల్లా స్థాయికి ఎంపికైన 351 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రాజెక్టు వీడియోలు, ఫొటోలు, ఆడియోను నిర్దేశించిన నమూనాలో ఆన్‌లైన్‌లో ఇన్‌స్పైర్ అవార్డ్స్ యాప్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియంతా ఈ నెల 25వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. కావున 351 మంది విద్యార్థులకు సంబంధించిన గైడ్ టీచర్లు విద్యార్థులచే ప్రాజెక్టులను సిద్ధం చేసి ఉంచుకోవాలని తెలిపారు. అప్‌లోడ్ చేసే విధానాన్ని అంశాల వారీగా వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు. దీనిపై సంక్రాంతి సెలవుల తర్వాత ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంతోపాటు ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకుని రాష్ట్ర స్థాయికి, జాతీయ స్థాయికి వెళ్లే విధంగా ప్రాజెక్టులను మెరుగుపరిచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి కృషి చేయాలని వివరించారు. మరిన్ని వివరాలకు 9441035830 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్సీ రామచంద్రయ్య



కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యులు సి.రామచంద్రయ్య కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పురోగతి వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో రామచంద్రయ్య తనయుడు విష్ణు స్వరూప్ పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయండి

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్టీపీపీ సీఈ మురళీకృష్ణకు ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ విషయంపై ఏపీజెన్‌కోపై పోరాటం చేస్తామని యూనియన్ నేతలు చెప్పారు. గతంలో కూడా చాలా సార్లు ఇక్కడ పని చేసిన సీఈలకు, ఈఎస్‌ఐ అధికారులకు వినతులు అందించామని వారు పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

కొండాపురం : మండల పరిధిలోని డొంకుపల్లె గ్రామ సమీపంలో మంగళవారం పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.26540 స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఢీకొన్న కార్లు : ఒకరికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

వేముల : వేముల సమీపంలో గల చెరువు కట్ట వద్ద మంగళవారం కార్లు ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులివెందులలోని ఫుడ్ అండ్ సైన్స్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నజ్మా కడప నుంచి పులివెందులకు వస్తుండగా.. అదే సమయంలో చెరువు కట్ట సమీపంలోని తోటలో నుంచి కారు రోడ్డుపైకి ఒక్కసారిగా రావడంతో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పురుషోత్తమ అనే వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఎంపీడీఓకు గాయాలు

రామాపురం : మండలంలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచోటి ఎంపీడీఓ మల్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నుంచి రాయచోటికి కారులో వస్తుండగా.. మార్గంమధ్యలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మల్‌రెడ్డికి గాయాలు కావడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితుడిని 108లో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని..

మదనపల్లె : ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన చిత్తూరుజిల్లా చౌడేపల్లె మండలంలో జరిగింది. రాయచోటికి చెందిన బి.రమణ(32) పీలేరు ఇరిగేషన్ కార్యాలయంలో ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో పీలేరు నుంచి పుంగనూరుకు వెళుతుండగా చౌడేపల్లె సమీపంలో ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడ్ని 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు.

ఏక వీరమ్మ గుడిలో చోరీ

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జె.వడ్డిపల్లె గ్రామంలో గ్రామ దేవత ఏకవీరమ్మ గుడిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రోజూ ఉదయం విద్యుత్ దీపాలు ఆర్పేందుకు గ్రామస్తుడు బి.సుబ్బరాయుడు గుడిలోకి వెళ్లగా.. తలుపు తెరచి ఉంటడం గమనించి స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళం తీసి నోట్లు తీసుకెళ్లి, చిల్లరను వదిలి వెళ్లారు. హుండీని పగల గొట్టకుండా తాళం చాకచక్యంగా తీసి, గర్భగుడి ప్రవేశ ద్వారం తలుపులు పగుల గొట్టి అమ్మవారి మెడలోని ఏడు మంగళ సూత్రాలను దొంగలించారు. ఈ మంగళసూత్రాలు దాదాపు రూ.30 వేల విలువ చేస్తాయని ఎస్‌ఐ తెలిపారు. గతంలో దొంగతనం చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. గుడిలోపల భద్రత కోసం వెంటనే కమిటీ సభ్యులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్‌ఐ సూచించారు. కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని ఆయన తెలిపారు.

చౌక బియ్యం స్వాధీనం

నూకలుగా మార్చి తరలిస్తుండగా దాడులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పరిధిలోని మండి బజార్‌లో ఉన్న హేమలత కాంప్లెక్స్ గదిలో చౌక బియ్యాన్ని నూకలుగా మార్చి తరలిస్తుండగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. వ్యాపారి తాటి గురు శరత్‌కుమార్‌తోపాటు లారీ డ్రైవర్ బడిమెల్ల రామసుబ్బయ్యపై 6ఏ కింద కేసు నమోదు చేశారు. తాటి గురు శరత్ కుమార్ హేమలత కాంప్లెక్స్‌లోని 13వ గదిలో రెండు నూకల మిషన్లను ఏర్పాటు చేసుకున్నాడు. చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ కార్డుల దారుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసిన అనంతరం నూకలుగా మార్చి తరలిస్తున్నాడు. మంగళవారం ఇలా తయారు చేసిన వాటిని నంద్యాలకు తరలిస్తుండగా.. తమకు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామకృష్ణ, జమ్మలమడుగు డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఎల్.వరదకిశోర్‌రెడ్డి దాడి చేసి పట్టుకున్నారు. మొత్తం 55 బస్తాల నూకలతోపాటు 124 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌కు తరలించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కానిస్టేబుళ్లు డి.హరినాథరెడ్డి, పి.సుదర్శన్‌రెడ్డి, ఏఓ బాలగంగాధర్‌రెడ్డి, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

బియ్యం తరలిస్తున్న రెండు లారీల సీజ్

కడప అర్బన్/చింతకొమ్మదిన్నె : జిల్లాలోని చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు పంచాయతీ కడప– రాయచోటి మెయిన్ రోడ్డులో చౌక డిపో బియ్యంను తరలిస్తున్న రెండు లారీలను మంగళవారం పట్టుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలియజేశారు. కడప విజిలెన్స్ అధికారులు టి.రెడ్డెప్ప, ఈదుర్‌బాషా, సీఎస్‌డీటీలు పి.సౌజన్య, పీఎస్‌వీ మనోజ్, సిబ్బంది జనార్దన్‌రావు, కె. నాగేశ్వరరావు, స్థానిక రెవెన్యూ అధికారులతో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. లారీలలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు కడప, రాయచోటిల మీదుగా తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేశారు. రెండు లారీలలో మొత్తం కలిపి 55,475 కిలోల బరువున్న 1096 బియ్యం బస్తాలు, రెండు లారీలను సీజ్ చేశారు. వీటి విలువ లారీలతో కలిపి రూ. 34,80,312 వుంటుందనీ అదనపు ఎస్పీ తెలియజేశారు. ఈ సంఘటనలో లారీల డ్రైవర్లు జిల్లాలోని బద్వేల్ టౌన్ కుమ్మరికొట్టాలుకు చెందిన పాలెం అమీర్‌బాషా, మైదుకూరు టౌన్ కొత్తకొట్టాలుకు చెందిన షేక్ మహమ్మద్ రఫీ, ఖాజీపేట మండలం పుల్లూరు గ్రామంకు చెందిన పుల్లూరు దిబ్బగాండ్ల వెంకటయ్యలు వున్నారు. వీరిపై కేసు నమోదు చేసి లారీలను, నిందితులను చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.



గదిలోని చౌక బియ్యాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో..

కడప నగరంలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటో నగర్ సమీపంలో టాటా మ్యాజిక్ వాహనంలో 35 బస్తాల రేషన్ బియ్యంను తరలిస్తున్న వినయ్ అనే నిందితుడిని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలియజేశారు. చెన్నూరు మండలం ఓబుళంపల్లెకు చెందిన నిందితుడు కడప నగర శివార్ల ప్రాంతాలలోని ప్రజల నుంచి రేషన్‌ను కొనుగోలు చేసి తీసుకుని వెళుతుండగా పట్టుకున్నట్లు పోలీసులు తెలియజేశారు.

రెండు ఆటోలు సీజ్

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని వలసపల్లి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టుకొని రెండు ఆటోలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటక్రిష్ణయ్య తెలిపారు. ఆటోల్లో ఉన్న సుమారు 2800 కిలోల బియ్యంను పట్టుకున్నారు. ఆది, సుజాత, నరేష్, వినోదలను అదుపులోకి తీసుకున్నారు. అనంతపురం జిల్లా ముదిగుబ్బకు చెందిన వీరు కదిరికి తీసుకుని పోతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

వక్ఫ్ భూములను డిజిటల్ ల్యాండ్ రికార్డులో చేర్చాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కేటాయించిన వక్ఫ్ బోర్డు ఆస్తులను డిజిటల్ ల్యాండ్ రికార్డుల్లో చేర్చాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఆర్వో గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు డిజిటల్ సర్వేలో వక్ఫ్ గెజిట్‌లో ఆస్తులన్నింటిని చేర్చి సమగ్రంగా ఉండేట్లు జిల్లాలోని తహశీల్దార్లకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ముస్లిం మైనార్టీలకు అభివృద్ధికి ఉపయోగపడాల్సిన రూ. కోట్ల వక్ఫ్ బోర్డు ఆస్తులు తప్పుడు డాక్యుమెంట్లతో పరుల పాలు అవుతున్నాయని ఆరోపించారు. ఇన్సాఫ్ నాయకులు షరీఫ్, మైనుద్దీన్, గౌస్, బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలి


ఆర్‌డీఓ పరిపాలన అధికారి ప్రతాప్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర విభజన చట్టంలో తెలిపిన విధంగా జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌డీఓ పరిపాలన అధికారి ప్రతాప్ రెడ్డికి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా విస్మరించడం దారుణమని ధ్వజమెత్తారు. ప్రైవేట్ రంగంలో ఉక్కు పరిశ్రమ నిర్మించడం వల్ల రిజర్వేషన్లు అమలు కావన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకువచ్చి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సురేష్ నాయక్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించాలి

– ఆర్టీసీ ఈడీకి నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వినతి


ఆర్టీసీ ఈడీకి వినతిపత్రమిస్తున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తమతమ స్వస్థలాలకు వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ సరైన సౌకర్యాలు కల్పించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు కోరారు. మంగళవారం ఈ మేరకు వారు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గోపీనాథ్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు టిక్కెట్ ధరలను అమాంతంగా పెంచి ప్రజలను దోచుకుంటున్నారన్నారు.దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ సభ్యులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్ క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ


క్రీడాకారులతో పాఠశాల ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా టెన్నికాయిట్ బాలికల జట్టుకు హ్యాపీ కిడ్స్ కరస్పాండెంట్ పి. శివకుమారి క్రీడా దుస్తులను అందజేశారు. ఈనెల 11, 12 తేదీల్లో అనకాపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఆమె టీషర్ట్స్ పంపిణీ చేశారు. అమీల్, అంకన్న, శివశంకర్, రవిశంకర్, శేఖర్ తదితరుల పాల్గొన్నారు.

ఆలిండియా అథ్లెటిక్స్‌లో వైవీయూ క్రీడాకారుడి ప్రతిభ

వైవీయూ : అఖిల భారత విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో యోగివేమన విశ్వవిద్యాలయం క్రీడాకారుడు నక్కా రాజేష్ 7వ స్థానంలో నిలిచాడు. చెన్నైలో నిర్వహిస్తున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో 49.23 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి సత్తాచాటి టాప్–10లో నిలిచాడు. విశ్వవిద్యాలయ క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి, శిక్షకుడు డా. కె. కృష్ణారెడ్డి తదితరులు రాజేష్‌ను అభినందించారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్‌సీసీ ఆఫీసర్స్ డాక్టర్ నీలవేణి, హేమలతల పర్యవేక్షణలో ముందస్తు సంక్రాతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి భోగిమంటలు వేసి వేడుకలను ప్రారంభించగా ప్రిన్సిపాల్ సూర్యారావు పొంగలి తయారీకి కొబ్బరికాయ కొట్టి సంబరాలను మొదలు పెట్టారు. సూర్యట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్‌లో భాగంగా విద్యార్థులకు నృత్య, సంగీత పోటీలతోపాటు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షురాలు నారాయణమ్మ, అధ్యాపకులు అరుణ, వాణి, గోవిందరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఇందిర, భారత్, సుబ్రమణ్యం, సంటెప్ప, ఎన్‌సీసీ ఆఫీసర్స్ డాక్టర్ నీలవేణి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో ...

కడప నగరంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాగార్జున మోడల్ స్కూల్, గురుకుల విద్యాపీఠ్, జీఆర్‌టీజీవీకే ఇంగ్లీస్ మీడియం స్కూల్, భాష్యం–2లో సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా సంప్రదాయ దుస్తులతోపాటు హరిదాసు వేషధారణలో వచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భోగి మంట వేయడానికి సిద్ధమవుతున్న అధ్యాపకులు


జీఆర్‌వీజీవికే స్కూల్లో హరిదాసు వేషధారణలో..

నగరంలో గంగిరెద్దుల సందడి

కడప కల్చరల్ : సంక్రాంతి పండుగ రానుందని తెలియజేస్తూ నగరంలో పలుచోట్ల గంగిరెద్దుల సందడి కనిపించింది. నగర శివార్లలోని గ్రామాల్లో ఉదయం నుంచే గంగిరెద్దుల వారు తమ ఎద్దులను కనుల పండువగా అలంకరించి గ్రామాలలో ఇంటింటికి తిప్పారు. దాదాపు ప్రతి ఇంటి వద్ద గంగిరెద్దుతో విన్యాసాలు చేయించారు. ప్రజలు తమ ఇళ్ల వద్దకు వచ్చిన గంగిరెద్దులు సాక్షాత్తు శివుని వాహనమైన నందీశ్వరునిగా భావించి నుదుట పసుపు, కుంకుమలు రాశారు. కాళ్లు, కొమ్ములకు కూడా పసుపు కుంకుమలు రాసి రంగురంగుల తగరపు దారాలను అలంకరించారు. కొందరు నగదు ఇవ్వగా గంగిరెద్దుల వారు వారిని ఆశీర్వదించి నాదస్వరంతో సంగీతం వినిపించారు. గ్రామం చల్లగా ఉండాలని, వర్షాలు విరివిగా కురవాలని, జిల్లా పాడిపంటలతో విలసిల్లాలని ఆకాంక్షించారు.


గంగిరెద్దుల సందడి


ముగ్గుల పోటీలో విజేతకు బహుమతిని ప్రదానం చేస్తున్న యాజమాన్యం

మార్కెట్ యార్డ్ చైర్మన్‌కు సన్మానం

కడప రూరల్/కార్పొరేషన్: జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బంగారు గంగా దేవి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ వర్గాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంతకుముందు బంగారు నాగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, కొప్పుల శివయాదవ్, సీఆర్ఐ సునీల్ జయంత్, ఓబుల్‌రెడ్డి,పస్తం అంజి పాల్గొన్నారు.

పెద్ద దర్గాలో నేటి నుంచి ఉరుసు



కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రమైన కడప నగరంలోని అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. హజరత్ సయ్యద్‌షా దాదా ముర్షద్ అమీన్‌పీర్ సాహెబ్ పేరిట నిర్వహించనున్న ఈ ఉరుసులో భాగంగా బుధవారం గంధం ఉత్సవం, గురువారం ఉరుసు, శుక్రవారం తహలీల్ ఫాతెహా ఉంటుందని ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల సంఘం పాత్ర కీలకం

వైవీయూ : విశ్వవిద్యాలయం ప్రగతిలో పూర్వ విద్యార్థుల సంఘం పాత్ర ఎంతో కీలకమని వైవీయూ ఇన్‌చార్జి వీసీ జింకా రంగ జనార్దన్ పేర్కొన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన వీసీని వైవీయూ అలుమ్ని ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో అలుమ్ని క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు డా. టి. సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, ప్రతినిధులు మానస, సురేష్, శశికుమార్, శివశంకర్, వెంకటేష్, ఈరప్ప పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని నిరాశ్రయులు, అనాథ వృద్ధులకు కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. మునిశంకరయ్య ముఖ్య అతిథిగా హాజరై దుప్పట్లను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు ఉద్యోగ రీత్యా సేవలందించడమేగాక, సామాజిక సేవలో కూడా భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎంవీ చలపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫయాజ్ బేగ్, కోశాధికారి రఘు, డీఈఈలు లక్ష్మీపతి, నాగమునిస్వామి, చాంద్‌బాషా, సభ్యులు జయప్ప, రవి, పుల్లయ్య పాల్గొన్నారు.

విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు


రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్

కడప ఎడ్యుకేషన్: ఒకరు చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఖాన్ కా రిష్తా తారిఖ్ ఆలీ తరఫున రక్తదాన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సుహైల్ అహ్మద్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ హాజరై రక్తదానం చేయడం వల్ల కలిగే ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు హకీముద్దీన్, విలయత్ ఆలీ, ఖాజా, అష్రాఫ్, హిదాయతుల్లాహ్, ఇంతియాజ్ అహ్మద్, అరిఫుల్లాహ్, అస్లాం, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్స్ మొహమ్మద్ సికిందర్ హుస్సేన్ పాల్గొన్నారు.

జిల్లా మత సామరస్యం గర్వకారణం


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్: జిల్లాలోని మత సామరస్యం మనందరికీ గర్వకారణమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా తెలిపారు. మంగళవారం కడప నగరంలోని తన కార్యాలయంలో సీఆర్ఐ సుబ్బారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన కుమారుడు, ట్రస్టు చైర్మన్ సీఆర్ఐ సునీల్ జయంత్ ప్రచురించిన మూడు మతాల 2023 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్‌ప్రెసిడెంట్ గోవింద నాగరాజు, కార్పొరేటర్ మోతుకూరు సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు అంజి, కార్పొరేటర్ బాలస్వామిరెడ్డి, కల్యా సుధాకర్, కార్పొరేటర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల అభివృద్ధికి కృషి చేయాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ కళాశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇంటర్మీడియట్ ఆర్‌జేడీ విశ్వనాథ్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం కడప ఇంటర్ ఆర్ఐఓ కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ ఆధ్యాపకుల సంఘం(జీజేఎల్ఏ)కు సంబంధించిన క్యాలెండర్ ఆర్ఐవో రవి, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ జూనియర్ ఆధ్యాపకుల సంఘం(జీజేఎల్ఏ) జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా సెక్రటరీ రాజారావ్, ఉపాధ్యక్షుడు రవికుమార్, జాయింట్ సెక్రటరీ రవీంద్రరెడ్డి, స్టేట్ కౌన్సిలర్ రమణయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి


బాధితురాలతో మాట్లాడుతున్న జడ్జి కవిత

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆపదలో ఉన్న మహిళలకు వన్‌స్టాప్ సెంటర్ ఆపన్నహస్తమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. మంగళవారం నగరంలోని ఓం శాంతినగర్‌లో ఉన్న ఉజ్వల హోం, వన్‌స్టాప్ సెంటర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలోని గంగా ప్లాస్టిక్ సంస్థను ఆమె తనిఖీ చేశారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీసు సహాయం, మానసిక సలహాలు, వైద్యసహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉన్నాయన్నారు. గృహ హింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్‌లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాల సమయంలో వన్‌స్టాప్ సెంటర్‌ను సంప్రదించవచ్చన్నారు. భవన నిర్మాణ కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల హోమ్,స్వధార్‌హోం నిర్వాహకురాలు మూలె సరస్వతి, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, గంగ ప్లాస్టిక్ సంస్థ ప్రతినిధులు సునీల్‌కుమార్, తిరుపతయ్య, ఎస్ఐ జ్యోతి పాల్గొన్నారు.

కడప అర్బన్: కడప నగర శివార్లలోని దిశ వన్‌స్టాప్ సెంటర్(సఖి)గురించి అవగాహన కలిగి ఉండాలని న్యాయవాది జె. మాధవీలత, ఎస్ఐ జ్యోతి అన్నారు. మంగళవారం కడప నగర శివార్లలోని సీ.ఎం.ఆర్ పల్లెలో మెప్మా సమైక్య సమావేశంలో దిశ వన్‌స్టాప్ సెంటర్ (సఖి)పై అవగాహన కల్పించారు.

హిందీతో ఉజ్వల భవిష్యత్తు


సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం రమాదేవి

కడప ఎడ్యుకేషన్: హిందీ భాష నేర్చుకోవడం వల్ల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆలంఖాన్‌పల్లె జిల్లా పరిషత్తు హైస్కూల్లో విశ్వహిందీ దివస్ వేడుకలను కేఎస్ఎం హిందీభవన్ వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేఎస్ఎం హిందీ భవన్ వ్యవస్థాపకుడు కేఎస్ ఫర్హతుల్లా మాట్లాడుతూ హిందీ నేర్చుకోవడం వల్ల కలిగే లాభాలు, విశిష్టతల గురించి ఆయన వివరించారు. గణిత ఉపాధ్యాయుడు చంద్రమోహన్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం: పట్టణంలోని మార్కెట్ యార్డు కమిటీ కార్యాలయంలో బుధవారం జరిగే సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని పార్టీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం మార్కెట్ యార్డు కమిటీతో సమావేశం నిర్వహించి మధ్యాహ్నం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిషత్ సభా భవనంలో మంగళవారం ఆయన మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు ఎంతవరకు పరిష్కారమయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలపై స్పందించని అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అత్యవసరమైన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు నిధులు విడుదల చేసిందన్నారు. ఈ నిధుల పురోగతిపై పంచాయతీరాజ్ ఏఈ మల్లారెడ్డిని ప్రశ్నించగా ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో ఆయనపై అసహనం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యుత్, రైతులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ ఉదయభారతి, విద్యుత్ ఏఈ రాజగోపాల్‌లను ఆదేశించడంతో వారం రోజుల్లో పూర్తి చేస్తామని వారు హామీ ఇచ్చారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై దృష్టి సారించండి

–మండల సమావేశంలో ఎంపీపీ ఎం.వరలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

పెండ్లిమర్రి : వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైన మోటార్లు మరమ్మతులకు గురైతే తక్షణం స్పందించాలన్నారు. అలాగే జెడ్పీ వైస్ చైర్మన్ పి.బాలయ్య మాట్లాడుతూ మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. అనంతరం మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని సర్పంచ్‌లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పెండ్లిమర్రి హైస్కూల్‌లో ఉపాధ్యాయులు విద్యార్థులతో నీళ్లు మోపించడం, క్లాస్ రూమ్‌లల్లో కసువు ఊడ్పించడం వంటి పనులు చేయిస్తున్నారని సర్పంచ్ నాగమల్లారెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఎంఈఓ సుజాత ఇక నుంచి అలాంటి పనులు జరగకుండా చూసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే

వల్లూరు : గడప గడపకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వల్లూరు సచివాలయ పరిధిలోని సి.కొత్తపల్లె, లింగాయపల్లె, ఇసుకపల్లె గ్రామాల్లో పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డిగారి వీరారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. ప్రజలు చెబుతున్న సమస్యలను వింటూ, అక్కడి కక్కడే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ ప్రజల నుంచి కృతజ్ఞతలు అందుకుంటూ ముందుకు సాగారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలని సీఎం పదే పదే చెబుతున్నారన్నారు. మూడున్నరేళ్లుగా జగనన్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. 2014లో వేల హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు 2024 ఎన్నికలే చివరివన్నారు. వారికి డిపాజిట్ కూడా దక్కదని, ఇక వారు ఇంటికే పరిమితం అవుతారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మీ అందరి ఆదరాభిమానాలు కావాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లోకేశ్వర్‌రెడ్డి, కిషోర్‌కుమార్, గంగయ్య, వెంకటసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, పుల్లారెడ్డి, శ్రీను, చెన్నారెడ్డి, లక్షారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు ఎన్‌జీఓలో చేరడం శుభసూచికం

కమలాపురం : సచివాలయ ఉద్యోగులు 60 సంవత్సరాల చరిత్ర ఉన్న ఎన్‌జీఓలో చేరడం శుభ సూచికం అని కమలాపురం ఎన్‌జీఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగలక్ష్మీరెడ్డి, కార్యదర్శి వెంకటరత్నం తెలిపారు. మంగళవారం వారు ఎన్‌జీఓలో చేరిన సచివాలయ ఉద్యోగులకు మెంబర్‌షిప్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాము స్పందించి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను త్వరలో ఇప్పిస్తామని, ఖాళీగా ఉన్న జాయింట్ సెక్రటరీ పోస్టులను సచివాలయ ఉద్యోగులతో భర్తీ చేస్తామని ఆయన అన్నారు.

సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడిగా ప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : మండలంలోని 15 సచివాలయాల పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కన్వీనర్ల అధ్యక్షుడిగా బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన వీరప్రతాప్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. అనంతరం వీరప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా దానిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం మండలంలోని ఎస్.పాలగిరి గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు చాపాటి రమణారెడ్డి, గజ్జల రాజా రమేష్‌రెడ్డి తమ అనుచరులతో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.



రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్–2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)–రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్–వరేలా ద్వయం 6–3, 7–6 (7/4)తో రాబిన్ హాస్–మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్–వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11–2, 5–11, 2–11, 5–11, 13–11, 11–9, 11–8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13–11, 11–9, 11–6, 11–8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిదాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్–గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–19, 21–14తో యంగ్ ఎన్గా టింగ్–యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12–21, 21–17, 14–21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10–21, 8–21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్–కృష్ణప్రసాద్ ద్వయం 10–21, 18–21తో కాంగ్ మిన్ హుక్–సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19–21, 14–21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్–జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్–త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పోర్వోరిమ్‌లో పాండిచ్చేరి–గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.


కోహ్లి సెంచరీ అభివాదం

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలీ షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్ అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)లో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.


షనక

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.

9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1–143, 2–173, 3–213, 4–303, 5–330, 6–362, 7–364. **బౌలింగ్:** కసున్ రజిత 10–0–88–3, మదుషంక 6–0–43–1, హసరంగ 10–0–67–0, కరుణరత్నే 8–0–54–1, దునిత్ 8–0–65–0, షనక 3–0–22–1, ధనంజయ 5–0–33–1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1–19, 2–23, 3–64, 4–136, 5–161, 6–178, 7–179, 8–206. **బౌలింగ్:** షమీ 9–0–67–1, సిరాజ్ 7–1–30–2, పాండ్యా 6–0–33–1, ఉమ్రాన్ 8–0–57–3, చహల్ 10–0–58–1, అక్షర్ 10–0–58–0.

సినిమా

మా ఇల్లే పాన్ ఇండియా


శ్రుతీహాసన్

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

● రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

● రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతాదంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

● 'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

● చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

● ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

● ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

● 'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

● ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచీ సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతే కానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో... పది భారతీయ చిత్రాలు



ప్రతిష్ఠాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్ఆర్ఆర్ (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాఠీ కహీ హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీరీ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరపున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్ఆర్ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతారా' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీరీ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది



\- ఎస్ఎస్ తమన్

''పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి'' అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

● బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది. ● దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది. ● 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్ కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు. ● ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పర్దేశీ జంటగా మురళీ కిషోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిషోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్'' అన్నారు మురళీ కిషోర్. ''గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసుగారికి థ్యాంక్స్'' అన్నారు కిరణ్ అబ్బవరం.


● కశ్మీరా, కిరణ్ అబ్బవరం

నా కల తీరుతోంది



\- సంతోష్ శోభన్

''నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కల్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది'' అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– ''ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కల్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు.